క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

మోతీనగర్: నీలిమ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం పాండురంగనగర్‌లోని బాలాజీ స్వర్ణపురి కాలనీ హనుమాన్ దేవాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎండీ డాక్టర్ పి.శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. షుగర్ పరీక్షలు చేయించుకునే వారు ఆహారం తీసుకోక ముందు తీసుకున్న తరువాత పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సమీప ప్రాంతవాసులు వినియోగించుకోవాలని కోరారు.

నేడు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ శ్రీవివేకానంద నగర్‌లోని శ్రీషిరిడీ సాయిబాబా దేవాలయం వార్షికోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు ఫౌండర్ చైర్మన్ ఎం.శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వార్షికోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

వైజ్ఞానిక ప్రదర్శన

మోతీనగర్: వైజ్ఞానిక ప్రదర్శన ద్వారా విద్యార్థులకు మేధస్సు మరింత పెరుగుతుందని హోలి క్రాస్ హై స్కూల్ కరస్పాండెంట్ శివప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మూసాపేట డివిజన్ పాండురంగనగర్‌లోని హోలి క్రాస్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను ఉప విద్యాధికారి సాముల్ రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు 210 రకాల స్టాళ్లలో నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎంఏ ప్రెసిడెంట్ ఉమామహేశ్వరరావు, హెచ్‌ఎం ఏఎఎస్ క్రిత ఆగస్టు, వీవీరావు, కొల్లి లక్ష్మణ్, ఖాన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ తులసీనగర్‌లో ఎల్లమ్మతల్లి ఆలయం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ సీనియర్ నాయకులు రవీందర్ రావు, నరేంద్రరెడ్డి, బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్‌యాదవ్ ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రాణా ప్రతాప్‌నగర్, మహాలక్ష్మి టెంపుల్ నుంచి గీతాంజలి స్కూల్ వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం కార్పొరేటర్ సబిహా బేగం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మరో రెండు ప్రాంతాల్లో యూజీడీ పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని కూడా త్వరగా పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు మాధవాచారి, సీహెచ్.యాదగిరిచారి, లింగం, రాధాకృష్ణ, రాజయ్యచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ శిరీష

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని ఆంజనేయనగర్‌లో శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం స్వామివారి వాయు ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ పగుడాల శిరీష, కోఆర్డినేటర్ సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్ పి. బాబూరావు, తూము శ్రావణ్‌కుమార్‌లు విచ్చేసి స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సీహెచ్. ప్రభాకర్‌గౌడ్, కాలనీ అధ్యక్షుడు మున్నా, జీఎస్.కృష్ణంరాజు, ఆలయ కమిటీ చైర్మన్ పాండుగౌడ్, కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రూ.999కే డయాలసిస్ సేవలు

- కల్వరి టెంపుల్ అధినేత బ్రదర్ సతీష్
- కల్వరి టెంపుల్‌లో డయాలసిస్ సెంటర్ ప్రారంభం

హఫీజ్‌పేట్ : కల్వరి టెంపుల్‌లో 999 రూపాయలకే డయాలసిస్ సేవలు అందిస్తున్నామని కల్వరి టెంపుల్ అధినేత బ్రదర్ సతీష్, సునీత్రిలు అన్నారు. శుక్రవారం మియాపూర్ కల్వరి టెంపుల్ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలన్న మానవత దృక్పథంతో డయాలసిస్ సెంటర్‌ను నెలకొల్పడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు కల్వరి టెంపుల్ ఆసుపత్రిలో 55వేల మందికి వైద్యం అందించామని పేర్కొన్నారు.

నిధులున్నా.. పనులు సున్నా!

- ఐదేళ్లుగా విస్తరణకు నోచుకోని నాలా
- నిధులు మంజూరైనా ముందుకు సాగని పనులు
- వర్షాకాలంలో ప్రజలకు తప్పని తిప్పలు
- వేసవిలోనే విస్తరణ పనులు పూర్తి చేయాలని డిమాండ్



వసుంధర ఆసుపత్రి రోడ్డులో నాలా

మూసాపేట: ఓపెన్ నాలా విస్తరణ పనులకు మోక్షం కలగడం లేదు. నిధులు లేక నాలా పనులు జరగటం లేదనుకుంటే పొరపాటే. ఐదేళ్ల క్రితమే ఈ పనులకు రూ.5.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కానీ ఇప్పటికీ అక్కడ ఎలాంటి నాలా విస్తరణ పనులు చేపట్టకపోవడం గమనార్హం. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా తమ గోడును పట్టించుకోవటం లేదని స్థానికులు వాపోతున్నారు. వేసవిలోనైనా నాలా విస్తరణ పనులు చేపట్టి పూర్తి చేయాలని కోరుతున్నారు. నిధులు ఉన్నా పనులు చేపట్టకపోవటం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

- కూకట్‌పల్లి ఐడియల్ చెరువు అలుగు నుంచి కూకట్‌పల్లి ఆర్‌టీసీ డిపో వరకు 1.6 కిలోమీటర్ల దూరంలో సహజసిద్ధంగా ఓపెన్ నాలా విస్తరించి ఉంది. కొన్ని చోట్ల నాలా కబ్జాలకు గురై కుంచించుకుపోయింది. మరి కొన్ని ప్రాంతాల్లో నాలాను మళ్లించి బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు.
- శ్రీహరినగర్‌లోని వసుంధర ఆస్పత్రి వెనుక భాగం నుంచి ఆర్‌టీసీ డిపో వరకు సుమారు 300 మీటర్లు నాలాను వెడల్పు చేసేందుకు ప్రాజెక్టు అధికారులకు అప్పగించారు. సుమారు 5.5 కోట్లతో సుమారు 5 సంవత్సరాల క్రితం (2017) 6 నుంచి 10 ఫీట్ల వెడల్పులో ఉన్న ప్రస్తుత నాలాను 20 ఫీట్ల వెడల్పుకు చేపట్టేందుకు పనులను అప్పగించారు.
- నిధులు కూడా మంజూరైనప్పటికీ ఇప్పటి వరకు ఆ ప్రాంతంలో ఎలాంటి పనులు కూడా చేపట్టలేదు. కనీసం స్థానికులకు కూడా నిధులు మంజూరైనట్లు తెలియదు. నిధులు లేకపోవటంతో నాలా వెడల్పు చేయటం లేదేమోనని అనుకుంటూ ప్రతి వర్షాకాలంలో ప్రజలు అవస్థలు పడుతూనే ఉన్నారు.
- నాలా విస్తరించాలంటే భూసేకరణ మొదట చేపట్టాల్సి ఉంటుంది. 20 అడుగుల నాలాను విస్తరించటానికి నాలా పరివాహక ప్రాంతంలో భూ సేకరణ చేయాలి. ఇందుకు టౌన్ ప్లానింగ్ అధికారులు చొరవ చూపి సమన్వయంతో భూ సేకరణ చేపడితే నాలా అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయి.
- కానీ ప్రాజెక్టు, టౌన్ ప్లానింగ్ అధికారుల సమన్వయ లోపంతో ఐదేళ్లుగా నిధులు ఉన్నా పనులు ప్రారంభించలేకపోతున్నారు. ఈ వర్షాకాలం వచ్చేటప్పటికైనా ఈ నాలా విస్తరణ పనులను 20 అడుగులకు పెంచి తమ కష్టాలను తీర్చాలని అధికారులను, ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనం..



ఐదేళ్లుగా నాలా విస్తరణ పనులు జరగటం లేదు. నిధులు ఉన్నా అదే పరిస్థితి. అధికారుల నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనం. ఇప్పటికైనా పనులు పూర్తి చేయాలి.

– ఎండీ మోయిజ్

భూ సేకరణ చేపట్టాల్సి ఉంది..

నాలా విస్తరణ పనులకు నిధులు మంజూరయ్యాయి. భూ సేకరణ పనులు చేపట్టాల్సి ఉంది. ఆ పనులు ముగిసిన వెంటనే 20 ఫీట్ల నాలా విస్తరణ పనులను మొదలు పెట్టి త్వరితగతిన పూర్తి చేస్తాం.

– ప్రాజెక్టు డీఈ జాకీర్ హుస్సేన్

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌లో రూ.25లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ గురువారం అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంక్షేమం, అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. అదే విధంగా కూకట్‌పల్లి డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ పాపిరెడ్డినగర్‌కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభించుకోవటం సంతోషమైన విషయమన్నారు. అదే విధంగా కూకట్‌పల్లి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, పాపిరెడ్డినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి భగవంతరెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీను, సోమిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హైదర్‌నగర్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తా

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ హెచ్‌ఎంటీ



శాతవాహనగర్‌లో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

శాతవాహనగర్ కాలనీలో రూ.48.50 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ గురువారం రాత్రి పరిశీలించారు. కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించుకోవటం చాలా సంతోషకరమైన విషయమన్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను పూర్తి చేస్తామని తెలిపారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కోసం శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



పాపిరెడ్డినగర్ కాలనీలో అర్ధరాత్రి సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

వర్షాకాలం నాటికి డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తాం



డ్రైనేజీ పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హెచ్‌ఎంటీహిల్స్ కమ్యూనిటీకాలనీలో సుమారు రూ.10లక్షల వ్యయంతో నిర్మిస్తున్న డ్రైనేజీ పైపులైన్ పనులను హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు శుక్రవారం జలమండలి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హైదర్‌నగర్ డివిజన్‌లో అన్ని ప్రాంతాల్లో వర్షాకాలం నాటికి డ్రైనేజీ సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని అన్నారు. నిత్యం డ్రైనేజీ పొంగుతున్న ప్రాంతాల్లో ప్రథమ ప్రాధాన్యతగా పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని ఎక్కడా రాజీ పడవద్దని సూచించారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ ప్రశాంతి, సూపర్‌వైజర్ నరేంద్ర, భాగ్యనగర్ ఫేజ్–3 కాలనీవాసులు శ్రీధర్, జవహర్ బాబు, శివాజీ, విజయ్, కృష్ణ, అరబ్, సందీప్, శైలేష్, వినోద్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో ముగిసిన రెండు రోజుల సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజివ్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సు శుక్రవారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా అసోసియేట్ ప్రొఫెసర్, సదస్సు కన్వీనర్ డాక్టర్ జే రాణి రత్నప్రభ రచించిన 'భారత దేశంలో అసంఘటిత కార్మికులు: సమస్యలు, సవాళ్లు' అనే పుస్తకాన్ని నోయిడా వివిగిరి లేబర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ జనరల్ అమిత్‌నిర్మల్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.

'మనూ'లో ప్లేస్‌మెంట్ డ్రైవ్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వ విద్యాలయంలో శిక్షణ, ప్లేస్‌మెంట్ సెల్ షాహీన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ సహకారంతో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను మార్చి 13 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని డాక్టర్ మహ్మద్ యూసుఫ్ ఖాన్ శుక్రవారం తెలిపారు.ఈ ప్లేస్‌మెంట్ కేవలం బీఈడీ, ఎంఈడీ పాసైన విద్యార్థులు (దూరవిధానం)కు అవకాశం ఉంటుందన్నారు.

వేతనాలు చెల్లించాలని ధర్నా

మేడ్చల్: గ్రామ పంచాయతీల్లో నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న తమ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ వివిధ గ్రామాల పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సీఐటీ యూ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించారు. నాలుగు నెలలుగా తమకు జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తమకు ఎందుకు వేతనాలు ఇవ్వడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి స్పోర్ట్స్ మీట్

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజీలో ఈనెల 11 నుంచి 4వ ఆల్ ఇండియా సౌత్ జోన్ ఇంటర్ పాలీటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2022–23ను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ సీడీ నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, సాంకేతిక విద్యాకమిషనర్ నవీన్‌మిట్టల్, ఉన్నత విద్యాశాఖ సెక్రటరీ కరుణ పాల్గొంటారన్నారు.

ఉర్దూ అందమైన,సున్నితమైన భాష

హర్యానా అశోకా యూనివర్సిటీ విజిటింగ్ ప్రొఫెసర్ పెగ్గీమోహన్



రాయదుర్గం: ఉర్దూ చారిత్రాత్మక భారతీయ భాష అని హర్యానా అశోకా యూనివర్సిటీ విజిటింగ్ ప్రొఫెసర్ పెగ్గీమోహన్ అన్నారు. శుక్రవారం గచ్చిబౌలిలో మనూ సెంట్రల్ లైబ్రరీ ఆడిటోరియంలో 'ది స్టోరీ అండ్ ప్రీ హిస్టరీ ఆఫ్ ఉర్దూ' అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉర్దూ స్థానిక సంస్కృతిని కలిగి ఉంటుందని, ఇది అందమైన, సున్నితమైన భాష అని పేర్కొన్నారు. వివిధ పేర్లతో పిలిచే కాలంలో ఉర్దూ ఎలా పరిణామం చెందిందో వివరించారు. ఉర్దూలో ఉజ్బెక్ భాష ప్రభావం ఉందని ఆమె పేర్కొన్నారు. వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ మాట్లాడుతూ ఏ భాష లోనైనా స్థానిక సంస్కృతి చాలా బలంగా ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రొఫెసర్ పెగ్గీమోహన్ ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమంలో దక్కన్ కల్చర్, హెరిటేజ్ నిష్ణాతులు సజ్జద్‌షాహిద్, ప్రొఫెసర్ నసీముద్దీన్ ఫరీస్, ప్రొఫెసర్ సయ్యద్ ఇంతియాజ్ తదితరులు ప్రసంగించారు.

ప్రపంచశాంతికి బ్రహ్మకుమారీస్ కృషి అభినందనీయం



ఎమ్మెల్యే వివేకానంద్‌ను సన్మానిస్తున్న బ్రహ్మకుమారీస్

కుత్బుల్లాపూర్: ప్రపంచశాంతికి బ్రహ్మకుమారీస్ చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఈ మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం 125 డివిజన్ పరిధిలోని కైలాష్‌హిల్స్‌లో నూతనంగా నిర్మించిన బ్రహ్మకుమారీస్ శివ జ్యోతి భవన్ ×రాజ్ యోగా మెడిటేషన్ సెంటర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచ శాంతికి పవిత్ర సందేశమిస్తూ.. అనేక సేవలందిస్తున్న బ్రహ్మకుమారీస్ ఉన్న ప్రతి ప్రాంతం ప్రశాంతంగా ఉంటుందని కొనియాడారు.

చింతల్ డివిజన్‌లో ప్రగతియాత్ర..

చింతల్ 128 డివిజన్ పరిధిలో 'ప్రగతి యాత్ర'లో భాగంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పర్యటించారు. ఈ మేరకు ఎస్ఎల్‌బీనగర్, పద్మశాలిబస్తీల్లో పాదయాత్ర చేస్తూ అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం మిగిలిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా పనులన్నీ త్వరలోనే పూర్తి చేయిస్తానని ప్రజలకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఈ–సమ్మిట్ ప్రోత్సాహం

కుత్బుల్లాపూర్: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక అవకాశాలను అందించేందుకు మహీంద్రా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ–సమ్మిట్ నిర్వహించారు. మార్చి 9, 10వ తేదీలలో హైదరాబాద్‌లో రెండు రోజులపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎక్కువ మంది యువత తమ ఆసక్తిని చూపడంతో పాటు హైదరాబాద్‌లో పెట్టుబడిదారులకు నమ్మకం కలిగిందన్నారు. పారిశ్రామిక వ్యవస్థలో కొత్తగా ప్రవేశించే వారికి మార్గనిర్దేశం చేయడానికి ఈ–సమ్మిట్ మేలు చేస్తుందని తెలిపారు. ఈ–సమ్మిట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వివిధ దేశాల నుంచి వచ్చిన వారి అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్త కొత్త ఆలోచనలు ఉన్న వారిని ఒకేచోట చేర్చడానికి వేదిక అయ్యిందన్నారు.

- ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పేరుగాంచిన వెర్బలైజర్ సిరీస్‌ను కార్యక్రమంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో భాగంగా అద్భుతమైన స్టార్టప్ షోలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నిధులు, పెట్టుబడులు వ్యూహాలు సాంకేతిక అభివృద్ధి చెందుతున్న పోకడలు సమాజంలో వాటికి ఉన్న ఆదరణ గురించి వివరించారు. కార్యక్రమంలో అజిత్ రంగ్నేకర్, రేవతిరో షార్క్ పోటీదారులు రవి, అనుజ కబ్రా నిఖిల్ లాంటి ప్రముఖులు వారి సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమానికి పీవీఆర్ లాస్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంకు మద్దతు అందించాయి.



ఈ–సమ్మిట్‌లో పాల్గొన్న ఔత్సాహికులు

యుద్ధవీరుల కుటుంబ రక్షణ నిధికి విరాళం

కేపీహెచ్‌బీకాలనీ: విద్యార్థుల్లో సామాజిక స్పృహ, సమాజం పట్ల వారికి బాధ్యతను తెలియజెప్పేందుకు బ్లూమింగ్ డేల్స్ హైస్కూల్ ఆధ్వర్యంలో ప్రతి మూడు సంవత్సరాలకు ఒక చారిటబుల్ ఈవెంట్ నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం జనవరిలో నిర్వహించిన బ్లూమింగ్ డేల్స్ ఫెస్ట్ అనే ఈవెంట్‌లో వచ్చిన మొత్తం 1 లక్ష 65 వేల రూపాయల మొత్తాన్ని శుక్రవారం యుద్ధవీరుల కుటుంబ రక్షణ నిధికి విరాళంగా అందించారు. సైనిక్ భవన్ సికింద్రాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అందుకు సంబంధించిన డిమాండ్ డ్రాఫ్ట్‌ను బ్రిగేడియర్ సంతోష్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బ్రిడియర్ సంతోష్‌కుమార్ విద్యార్థులతో ముచ్చటించి వారిని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రంజనీ ప్రభాకర్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న కూకట్‌పల్లి జెడ్‌సీ మమత

కూకట్‌పల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా శుక్రవారం కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో జోడాస్ ఎక్స్‌పోయం ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా జెడ్‌సీ మమత మాట్లాడుతూ... ఈనెల 8వ తేదీ నుంచి మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీలు, ఏఎంఓహెచ్, డీపీఓ తదితరులు పాల్గొన్నారు.

'డిజైన్ థింకింగ్'తోనే మంచి భవిష్యత్

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుత సాంకేతిక యుగంలో వినూత్న ఆలోచనలు కొనసాగించడానికి 'డిజైన్ థింకింగ్' విధానం అనువైనదని, ఈ విధానంతో విద్యార్థులు తమ పరిశోధనలను మరింత ఉన్నతంగా నిర్వర్తించవచ్చని శ్రీనిధి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సీఈఓ అభిజిత్‌రావు కటికనేని తెలిపారు. ఇన్నోవేషన్, డిజైన్ థింకింగ్ పైన నగర విద్యార్థులకు అవగాహన కల్పించడానికి శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్, టైటాన్, టింకర్ ల్యాబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో 'డిజైన్ థింకింగ్ ఫర్ సోషల్ ఇంపాక్ట్' అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో భాగంగా సాంకేతిక–సామాజిక సమస్యలను పరిష్కరించడంలో ఇన్నోవేషన్, డిజైన్ థింకింగ్ పోషించే కీలక పాత్రపై అవగామాన కల్పించారు. సాంకేతిక ఆవిష్కరణలపై మన్‌దీప్ సింగ్, డిజైన్ థింకింగ్–బిజినెస్ ప్రాబ్లమ్స్ అంశంపై రవి ప్రత్యేక సెమినార్లను నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో సంస్థ డైరెక్టర్ వాసుదేవ రావు యల్లపు, ప్రొఫెసర్ సీవీ టామీ, ప్రిన్సిపాల్ డాక్టర్ టీ.సీహెచ్.శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏళ్లు గడుస్తున్నా.. ఎదురుచూపులేనా?



నగర శివారు పురపాలికలు, పంచాయతీల్లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు 3.85 లక్షలు

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నుంచి 1,43,927 దరఖాస్తులు
- దాదాపు రెండున్నరేళ్ల క్రితం స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తుల స్వీకరణ
- సిబ్బంది కొరతతో ముందుకుసాగని దరఖాస్తుల పరిశీలన
- దరఖాస్తుదారులకు తప్పని నిరీక్షణ

సాక్షి,మేడ్చల్ జిల్లా: నగర శివారుల్లోని పురపాలికలు,గ్రామ పంచాయతీల్లో ఎస్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణకు మోక్షం లభించడం లేదు. ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోకపోవడంతో దరఖాస్తుదారులు నిరీక్షిస్తున్నారు. 2020 అక్టోబర్‌లో స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అర్హతలున్న స్థలాలకు ఆమోదం తెలుపుతామని పేర్కొన్న సర్కారు.. నేటికీ ఆ ప్రక్రియ ముందుకు తీసుకెళ్లడం లేదు. ఏళ్లుగా అనధికారికంగా ఉన్న ప్లాట్లు, లేఅవుట్లు క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం ఎస్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)ను తీసుకొచ్చింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం ఇస్తామని బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. దీంతో ఎల్‌ఆర్‌ఎస్ కింద దరఖాస్తు చేసుకున్న వారు ప్రభుత్వ ఆమోద ముద్ర కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

తప్పని నిరీక్షణ...

నగర శివారు జిల్లాలోని 29 పురపాలికల్లో ఎస్ఆర్ఎస్ కింద 3,85,674 దరఖాస్తులు వచ్చాయి. తొలి విడత ఫీజు రూ.వెయ్యి చెల్లించి దరఖాస్తులు స్వీకరించారు. మిగతా ప్రాంతాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సి ఉన్నా.. ఈ ప్రక్రియకు మోక్షం లభించకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం ప్రకటించిన నేపథ్యంలో ఎల్‌ఆర్‌ఎస్ కింద అనుమతి వస్తే భవనం నిర్మాణం చేపట్టడం,బ్యాంకు రుణాలు తీసుకోవాలనే వారికి నిరాశే మిగులుతోంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత..

క్రమబద్ధీకరణ క్రతువును టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్(టీపీబీఓ)లు చేపట్టాల్సి ఉంటుంది. వీరి తర్వాత టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ (టీపీఎస్) పరిశీలిస్తారు. ఆ తర్వాత టీపీఓ, కమిషనర్ అనుమతి మంజూరు చేస్తారు. కానీ తొలి, మలి ప్రక్రియ చేపట్టడానికి సిబ్బంది చాలా తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి రెండు జిల్లాలోని 29 పురపాలికల్లో ఈ విభాగంలో ఉద్యోగులు సరిపడా లేకపోవడం, ఉన్న వారికి వారానికి ఒక్కరోజు, రెండ్రోజులు మాత్రమే విధులు కేటాయిస్తుండటంతో వేల సంఖ్యలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించడం కష్టమవుతోంది.

భారీగా దరఖాస్తులు...

నగర శివారు జిల్లాలైన మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డిల పరిధిలోని 7 కార్పొరేషన్లు, 21 మున్సిపాలిటీలు, 297 గ్రామ పంచాయతీల నుంచి మొత్తం 3,85,674 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 29 పురపాలక సంఘాల నుంచి 3,74,447 దరఖాస్తులు, 297 జీపీల నుంచి 11,227 దరఖాస్తులు వచ్చాయి. ముఖ్యంగా మేడ్చల్ జిల్లాలోని 4 మున్సిపల్ కార్పొరేషన్లు, 9 మున్సిపాలిటీలతో సహా 51 జీపీల పరిధిలో 1,43,927 దరఖాస్తులు అందాయి. అదేవిధంగా రంగారెడ్డి జిల్లాలోని 3 మున్సిపల్ కార్పొరేషన్లు, 12 మున్సిపాలిటీలతో పాటు 246 గ్రామ పంచాయతీ పరిధిలో 2,41,747 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు వచ్చాయి.